www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 19 జూన్ 2023
5
తూర్పుగోదావరి

నేడు 'స్పందన'లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్పందన కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం లోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జూన్ 19న సోమవారం జిల్లా ఎస్పి సిహెచ్.సుధీర్ కుమార్ రెడ్డి తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం క్షేత్ర స్థాయిలో డివిజన్, మండల, గ్రామ స్థాయి స్పందన కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంటలకు ఫిర్యాదులను స్వీకరిస్తామని తెలిపారు. రెవెన్యూ, మునిసిపల్, మండల, గ్రామ, వార్డు సచివాలయాలలో స్పందన ఫిర్యాదులు అందచేయాలని కలెక్టర్ తెలియజేశారు. ఇకపై మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోటకు హాజరై స్పందన అర్జీలు స్వీకరిస్తారన్నారు.

సాగునీటి సరఫరాకు 'లాకు'

- శిథిలావస్థకు చేరిన వైనం
- నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి-కడియం

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల సస్యశ్యామలం కొరకు, ప్రజలకు తాగునీరు అందించు నిమిత్తం ఆనాడు మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ దొర చేసిన కషి ఫలితం తాలూకు ఫలాలు నేడు మనం అనుభవిస్తున్నాం. దీనికంతటికీ కారణమైన ప్రధాన కాలువల ఆధునికీకరణ లేదు.. అభివద్ధి అస్సలే లేదు. అతి ముఖ్యమైన లాకులు కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరి, మరికొన్ని చోట్ల తీరని సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి.

గోదావరి తూర్పుడెల్టా ప్రధాన కాలువపై కడియం వద్ద గల పాత, కొత్త లాకులు పలు తీరని సమస్యలతో సతమతమవుతున్నాయి. పలు సమస్యలు దీర్ఘకాలంగా తిష్టవేసి దర్శనమిస్తున్నాయి. పాత లాకుల పరిధిలో కాకినాడ ప్రధాన కాలువ, మండపేట ప్రధాన కాలువల ద్వారా సుమారు 94 వేల 284 ఎకరాలకు సాగునీరు అందుంఎంది. కొత్త లాకుల పరిధిలో సామర్లకోట ప్రధాన కాలువ ద్వారా సుమారు 62,453 ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ కాలువ పరిధిలో అనేక ఆయకట్టు చెరువులు, తాగునీరు చెరువులు కూడా ఉన్నాయి. సుమారు 1లక్షా 57 వేల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మంది ప్రజలకు త్రాగునీరు అందిస్తున్న ఇంతటి ప్రాధాన్యత గల లాకులు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా

సిల్ట్ పేరుకుపోయి పూర్తిగా మూతబడిన పాత లాకుల్లోని నావిగేషన్ ఛానల్

శిథిలావస్థకు చేరిన కొత్త లాకుల ప్లాట్ ఫామ్

పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు. ఎన్నిసార్లు విన్నవించినా ఎంత మొరపెట్టుకున్నా అధికారులు, పాలకులు కనీసం స్పందించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో లాకుల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు..

పాడైన కొత్త లాకుల ప్లాట్ ఫామ్

కొత్త లాకుల ప్లాట్ ఫామ్ పగుళ్ల ఏర్పడి, రంధ్రాలు పడి శిథిలావస్థకు చేరింది. ఈప్లాట్ ఫామ్ మీదుగా మాధవరాయుడుపాలెం, కడియపుసావరం గ్రామాల రైతులు తమ పొలాలకు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. వివిధ ప్రాంతాలకు చదువుల నిమిత్తం వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు, పరిశ్రమల్లో పని చేసే కార్మికులు పగలు, రాత్రి తేడాలేకుండా నిత్యం రాకపోకలు కొనసాగిస్తారు. గత 4, 5 సంవత్సరాలుగా సమస్య పరిష్కారం కావడంలేదని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు తక్షణం స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆపరేషన్ ప్లాట్ ఫామ్ పరిస్థితి అంతే

సిబ్బంది విధులు నిర్వహించే ఇనుప ఆపరేషన్ ప్లాట్ ఫామ్ తుప్పుపట్టి, రంధ్రాలు పడి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. లాకుల్లో దిగువకు నీటి ప్రవాహాన్ని తగ్గించి, పెంచే సమయాల్లో ఈ ప్లాట్ ఫామ్ ద్వారానే విధులు నిర్వహించాలని, స్లూ గేర్ బేరింగ్స్, షట్టర్స్ కూడా పాడవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. అలాగే లాకుల ప్రాంతంలో ఏవిధంగానూ నయాపైసా ఆదాయం సమకూరడంలేదని, కరెంటు బిల్లులు కూడా తమ చేతి డబ్బులు చెల్లిస్తున్నామని, శాశ్వత సిబ్బంది లేక నిర్వహణ భారంగా మారిందని లాకు సూపరింటెండెంట్ అంటున్నారు.

శిథిలావస్థకు చేరిన నావిగేషన్ ఛానల్ గేట్లు

పాత లాకుల్లోని నావిగేషన్ ఛానల్ పూర్తిగా మూసివేయడంతో సిల్ట్ పేరుకుపోయి, రైతులు పశుగ్రాసం పెంచుకుంటున్నారు. అలాగే కొత్త లాకుల్లో నావిగేషన్ ఛానల్ గేట్లు పూర్తిగా పాడయ్యాయి. దీనివల్ల లాకుల దిగువకు నీరు అవసరం ఉన్నా , లేకున్నా అన్నివేళలా ప్రవహిస్తూ , వథాగా పోతోంది. పూర్వం కాలువల ద్వారా పడవల్లో వివిధ సామగ్రి రవాణా, నావల ద్వారా ఇసుక రవాణా జరగడంతో కీలకమైన నావిగేషన్ ఛానళ్ల నేడు నిరుపయోగంగా మారాయి. వీటి ద్వారా ప్రస్తుతం రవాణా జరగడం లేదని, ఏ విధమైన ఉపయోగం లేదని అందుకే నిరుపయోగంగా వదిలేశారని సిబ్బంది అనడం కొసమెరుపు.

ఇబ్బందులు లేకుండా సాగు, తాగునీరు అందించే ఏర్పాట్లు

కడియం లాకుల్లోని వివిధ మరమ్మతులకు సంబంధించి ఆర్థిక అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాము. నిధులు మంజూరైన వెంటనే టెండర్ల ద్వారా పిలిచి, పనులు చేపట్టి పూర్తిచేస్తాం. నావిగేషన్ ఛానళ్లకు సంబంధించి మోడెరైజేషన్ పరిధిలోని అంశం అని, వాటి యొక్క పనులకు సంబంధించిన ప్రపోజల్స్ కూడా పంపించాం. ఏ విధమైన ఇబ్బందులు లేకుండా సాగు, తాగు నీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నాము.

–జి.రవికుమార్ , ఇరిగేషన్ డిఇఇ, కాకినాడ

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, పాల్గొన్న ప్రముఖులు

ప్రజలపై విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను ఉపసంహరించాలని ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్‌చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు, సర్దుబాటు ఛార్జీలు, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక వై.జంక్షన్ వద్ద ఉన్న ఆనం రోటరీ హాలు నందు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి టిడిపి రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, టిడిపి నాయకులు ఆదిరెడ్డి.అప్పారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.మురళిధర్, ఎపి పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సిపిఐ న్యూ డెమోక్రసీ నాయకులు కె.జోజి హాజరై మాట్లాడారు. సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ విద్యుత చార్జీలు పెంచనని అని వైసిపి హామీ ఇచ్చి ఆపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏడు సార్లు విద్యుత్ ఛార్జీల భారాన్ని పెంచినదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రజలకు కరెంట్ బిల్లు చుడగానే షాక్ కొట్టింది అని అన్నారు. ఇప్పటికే శ్లాబులు మార్చి భారం మోపారన్నారు. ఈ మే నెల బిల్లుల్లో 2014లో వాడుకున్న కరెంటుకు మళ్లీ యూనిట్ కు రూ.20పైసలు, 2021 మేలో వాడిన విద్యుత్తు యూనిట్ కు మరో రూ.20 పైసలు, 2023 ఏప్రిల్ లో ఉపయోగించిన కరెంట్ యూనిట్‌కు రూ.40 పైసలు కలిపి మొత్తం రూ.80 పైసలు చొప్పున జనం నెత్తిన వైసిపి ప్రభుత్వం భారం మోపిందని విమర్శించారు. ప్రపంచంలో కరెంటు చార్జీలు తగ్గుతున్నాయని, కానీ దేశంలో, రాష్ట్రంలో కరెంటు చార్జీలు తగ్గించాల్సింది పోయి పెంచుతున్నారని తెలిపారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. మన రాష్ట్రంలో 30 సంవత్సరాలపాటు వ్యవసాయానికి విద్యుత్ మొత్తం తయారు చేసే ఒప్పందం అదానికే ఇచ్చారని అన్నారు. విదేశాలనుండి బొగ్గు సరఫరా చేసేది, బొగ్గు రవణా చేసే ఓడరేవులు, తాజాగా స్మార్ట్ మీటర్లు తయారు చేసే కంపెనీ అదానికి, కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ జేబులు నింపుకుంటున్నాయన్నారు.

తీర్మానాలు..

1. ప్రజలపై విద్యుత్‌ఛార్జిల భారం, సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్‌ఛార్జీ భారాలను ఉపసంహరించాలని డిమాండ్ 2. ప్రి పెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించాలి. పై రెండు తీర్మానాలను రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా చేశారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, నాయకులు ఎస్ఎస్.మూర్తి, బి.పూర్ణిమరాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె.రాంబాబు, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, నాయకులు రాంబాబు, నల్లా.రామారావు, ఎమ్.విజయలక్ష్మి, నిర్మల, ఎఐటియుసి నాయకులు రామకృష్ణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు పి.మురళి కృష్ణ, జన విజ్ఞాన వేదిక సభ్యులు డా.చైతన్య శేఖర్, డి.జి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.రాంబాబు, జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఐద్వా నాయకులు బి.సుధ మరియు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ప్రముఖులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి-చాగల్లు

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి కెఎస్.జవహర్ అన్నారు. చాగల్లు గ్రామంలో ఆదివారం కోడూరి వీర్రాజు,నాదెండ్లశ్రీరాముల క్రీడా ప్రాంగణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో చాగల్లు మండల టిడిపి నాయకులు కరుటూరి సతీష్ కోడూరి ప్రసాద్, తాండ్రు గాంధీ, గన్నమని అచ్యుత పార్థసారధి, వేగి చిన్నా, కొఠారు గాంధీ, కోడూరి రాజేష్, ముళ్ళపూడి రాము, కొడవటి మెహెర్ బాబా. ఎడ్లపల్లి రకారావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నేడే రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం నుంచి వైఎస్ఆర్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో చేరటానికి ఎంపిక పోటీలను విద్యార్థులకు సోమవారం చాగల్లు జిల్లా పరిషత్ హైస్కూలు నందు నిర్వహిస్తామని మండల పరిషత్ అభివద్ధి అధికారి బొలిశెట్టి రాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4,5 తరగతులు చదివే ప్రభుత్వ, ప్రవేటు విద్యార్థులు సోమవారం ఉదయం9 గంటలకు కన్వీనర్ విజయలక్ష్మికి చాగల్లు హైస్కూలు నందు రిపోర్టు చేయాలని తెలిపారు . మండల స్థాయి లో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొనాలని అన్నారు . రన్నింగ్, లాంగ్ జంపింగ్ ల్లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు .

కార్టూ'నిజం'

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జెఇఇ అడ్వాన్స్ పరీక్షల్లో తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. వివిధ కేటగిరిలలో జాతీయ స్థాయిలో వి.శ్యామ్ శ్రీ వర్ధన్ 5వ ర్యాంకు, కె.వివేక్ వర్ధన్ 17వ ర్యాంకును, డి.శివరామ్ 55వర్యాంకు, జిడిపిఎస్ఎస్.శరణ్ 60వ ర్యాంకు, పి.యశ్వంత్ శ్రీనివాస్ 73వ ర్యాంకు, కె.గంగా ధనశ్రీ 74వ ర్యాంకు, డి.యువన్ గేట్స్ 79వ ర్యాంకు, ఎస్.యశ్వంత్ 90వ ర్యాంకు, ఎమ్. రాహుల్ 100వ ర్యాంకు సాధించారని తెలిపారు. వీటితో పాటు జాతీయ స్థాయిలో 103, 107, 117, 122, 137, 139, 176, 179, 193, 208, 233, 234, 244, 249, 262, 262, 266, 271, 272, 277, 325, 327, 333, 349, 358, 402, 422, 424, 434, 434, 448, 450, 457 సాధించారని 1000లోపు 71 మంది, 2000లోపు 142 మంది, 3000లోపు 205 మంది, 5000లోపు 282 మంది, 10000లోపు 361 మంది ర్యాంకులు సాధించారని అన్నారు. మొత్తం 382 మంది విద్యార్థులు కోచింగ్ తీసుకోగా 361 మంది ర్యాంకులు సాధించి 94.5శాతం సక్సెస్ రేటును పొందారని, సుమారు 230 మంది విద్యార్థులు ఐఐటిల్లో సీట్లు సంపాదించగలరని ఆయన తెలియజేశారు.



ర్యాంకర్లతో తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమలరావు

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'షిర్డిసాయి' సత్తా

ప్రజాశక్తి-కడియం

జెఇఇ అడ్వాన్స్ ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. రాజమహేంద్రవరం శ్రీ షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరిలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి సత్తా చాటారని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీ విద్య తెలిపారు. తమ లక్ష్యా ఐఐటి అకాడమీలో శిక్షణ పొందిన టి.గణేష్ కుమార్ జాతీయ స్థాయి 16వ ర్యాంకు సాధించగా, బిజెఎల్.సాయికిరణ్ 158వ ర్యాంక్ కైవసం చేసుకోగా, అంజనీ సుత ఆదిత్య 187, డి.జయప్రకాష్ 242, భరత్ నందా 316, సిహెచ్.మాన్విత 368, కె.రాజీవ్‌శ్రీసాయి 448వర్యాంక్ సాధించా రన్నారు. మొత్తం 7గురు విద్యార్థులు 500 లోపు ర్యాంకులు సాధించగా, 10 మంది 1000 లోపు ర్యాంకులు, 20 మంది 2000 లోపు, 32 మంది 5000 లోపు, 45 మంది 10000 లోపు ర్యాంకులు సాధించినట్లు శ్రీవిద్య వివరించారు. ఈ విజయం పట్ల శ్రీ షిర్డి సాయి విద్యాసంస్థల ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరైన మొత్తం 72 మందిలో 54 మంది దేశంలోని అత్యుతమ ఐఐటీల్లో సీట్లు సాధించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులను, అందుకు కషి చేసిన అధ్యాపక బృందాన్ని ఛైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యా అకాడమీ డీన్ చంద్రశేఖర్ లు అభినందించారు.



ర్యాంకర్లతో షిర్డిసాయి జూనియన్ కళాశాల డీన్ తదితరులు

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో శశి వేలివెన్ను విజయ దుందుభి

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

జెఇఇ అడ్వాన్స్‌డ్-2023లో శశి వేలివెన్ను తమ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించినట్లు శశి విద్యా సంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 లోపు నాలుగు, వెయ్యిలోపు 13, 2500లోపు 41, 5 వేలల్లోపు 69 ర్యాంకులు తమ విద్యార్థిని విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు ఆయన తెలి పారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన అధ్యాపకులు, విద్యార్థులకు విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ లక్ష్మి సుప్రియ అభినందనలు తెలిపారు.

ర్యాంకర్లతో శశి విద్యాసంస్థల యాజమాన్యం

యువతను ఓట్ల కోసం వాడుకుంటున్నారు

కాకినాడ సభలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, కాకినాడ రూరల్

ప్రస్తుత రాజకీయ పార్టీలు యువతను ఓట్లు కోసం వాడుకుంటున్నాయని, వాళ్ళ భవిష్యత్తు కోసం జనసేన పార్టీ పుట్టిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. వారాహి విజయ యాత్రలో భాగంగా ఆయన ఆదివారం సాయంత్రం కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. కాకినాడ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ విరుచుకుపడ్డారు. గుండాగిరీ చేస్తున్నారని, బియ్యం ఎగుమతుల్లో రూ.15 వేల కోట్లు దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో క్రిమినల్ రాజకీయ నాయకులు పాలిస్తున్నారన్నారు. 2009 నుంచి రాజకీయల్లో ఉండి ఉంటే ఇలాంటి క్రిమినల్ పార్టీ వైసిపికి అధికారం రాకుండా చూసుకొనే వాడినన్నారు. ద్వారంపూడి ఇంట్లోని అందరూ గూండాలని తెలిసిందన్నారు. అతని కుటుంబ సభ్యులకు గతంలో బేడీలు వేశారన్నారు. కాకినాడలో కాపు మహిళలను కాపు రౌడీలతో కొట్టించారన్నారు. కుల దూషణతో రెచ్చగొడితే మర్యాదగా ఉండదని హెచ్చరించారు. కులాన్ని వాడుకుని నాయకులే ఎదుగుతున్నారన్నారు. ద్వారంపూడి గూండాలకు కాకినాడలో నిలబడి హెచ్చరిస్తున్నా.. నాకు అవకాశం వస్తే ఈ గూండాలను తన్నుకుంటూ తీసుకెళ్తా అన్నారు. రౌడీ, గూండా ద్వారంపూడిని ఈసారి గెలవకుండా చూస్తానని తెలిపారు.

ద్వారంపూడి కనుసన్నల్లోనే కాకినాడ పోర్ట్ నుంచి 56 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రవాణా అవుతోందని ఆరోపించారు.

ఉభయ గోదావరి జిల్లాల్లో ఏ గుండాను గెలవనివ్వనని హెచ్చరించారు. శనివారం కాకినాడలో జరిగిన జనవాణిలో అనేక కబ్జా అంశాలు నా దష్టికి వచ్చాయన్నారు. ద్వారంపూడి అనుచరులు పిఠాపురంలో తుపాకీ తీసుకొచ్చి మట్టి తోలుతున్నారన్నారు. వైసిపి ఎంఎల్‌సి ఒక డ్రైవర్‌ను చంపి ఇంటికి డోర్ డెలివరీ చేస్తే మీకు కోపం రావడం లేదా అని ప్రశ్నించారు. యువత కులాన్ని దాటి చూడకపోతే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర హీరోల అభిమానులు కూడా తనకు అండగా నిలవాలని కోరారు. 'దయచేసి జనసేనకు మద్దతు ఇవ్వండి. భవిష్యత్తు కోసం ముందడుగు వెయ్యండి' అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

నీట్, జెఇఇ ఎంసెట్‌లో 'విజన్' సంచలన విజయాలు

విజయ్‌కుమార్

హనుదీప్

తులసి

గోవిందరాజు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నీట్ ఐఐటి, జెఇఇ ఎంసెట్ ఫలితాలలో ఒకే ఏడాది ఒక ఇన్స్టిట్యూట్ లో ఇన్ని ఉత్తమ ఫలితాలు రావడం ఇదే మొదటసారని విజన్ అకాడమీ డైరెక్టర్ యాగ.గోవిందరాజు తెలిపారు. సాధారణ విద్యార్థులను సైతం అసాధారణ విద్యార్థులుగా మారుస్తూ బోధనలో నూతన వరవడి తీసుకొస్తున్న సంస్థ విజన్ అకాడమీని ఆయన అన్నారు. సాధారణ ఫీజులతో ఈ సంవత్సరం నూతనంగా స్థాపించ బడిన 'నూతన బ్రాంచ్ 'విజన్ మెడికల్ అండ్ ఐఐటీఅకాడమీ నందు అనుబావుజ్ఞులైన ఉపాధ్యాయులచే ఎసి క్యాంపస్, డిజిటల్ క్లాస్ రూమ్స్ లో బోధన విద్యార్థులకు ఎంతో సహకరించిందని అన్నారు. పోయిన ఏడాది తో పోలిస్తే ఈ సంవత్సరము మరింత మెరుగైన ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత ఏడు సంవత్సరాలుగా రాజమహేంద్ర వరం నగరంలో విద్య పరంగా ఉత్తమ సేవలు అందిస్తూ, ఎపి, తెలంగాణలో సుమారు 8000 మంది విద్యార్థులకు పైగా వివిధ రంగాలలో స్థిరపడే విధంగా విజన్ అకాడమీ సహాయ పడడం, మరింత బాధ్యతగా తీసుకొని నీట్ ఐఐటి-జెఇఇ ఎంసెట్‌లో కూడా ఉత్తమ విద్యను అందించడానికి ఎక్కడా రాజీ పడకుండా విద్యార్థులను తీర్చిదిద్దుతామని అన్నారు. ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో నలుగురు విద్యార్థులు విజయం సాధించడం, అలాగే ఎంసెట్ ఫలితాలతో 250 మంది విద్యార్థులకు పైగా ఉత్తమ ర్యాంకులు సాధించడం, అందులోనూ 5000లోపు ర్యాంకులు 07, 10వేల లోపు ర్యాంకులు 12, 15వేల లోపు ర్యాంకులు 20 మంది, 16000 పైన ర్యాంకులు 250 మంది విద్యార్థులకు పైగా సంచలన ఫలితాలు సాధించారు అన్నారు. ఎంసెట్ లోమిర్తిపాటి విజయ కుమార్ 2618 ర్యాంక్ తో ప్రథమ స్థానం, జక్కా హనుదీప్ 2829 రాంక్ తో ద్వితీయ స్థానం, చీపురుపల్లి తులసి 3170 ర్యాంకుతో తృతీయ స్థానం, అలాగే ఆల్ ఇండియా నీట్ పరీక్షల్లో లో జక్కా హనుదీప్ మొదటి స్థానం, గంగుల బాలు యశ్వంత్ ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకుడైరెక్టర్ అభినందలు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

గన్నమని శేషగిరిరావు, బూరుగుపల్లి చిన్నారావు స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉండ్రాజవరం క్రికెట్ టోర్నమెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక క్రీడా మైదానంలో సాగాయి. విజేతలుగా నిలిచిన ఇరుజట్లు ఉండ్రాజవరం గ్రామానికే చెందినవి కావడం విశేషం. విన్నర్, రన్నర్ జట్లకు రూ.22వేలు, రూ.11 వేలు చొప్పున నగదు, జ్ఞాపికలు మండల టిడిపి నాయకులు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు బూరుగుపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు కోసం ఉమ్మడి పోరాటం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఎంతో కాలంగా పోరాటం చేస్తున్న సిపిఎస్ రద్దు కోసం ఇకపై ఉమ్మడి పోరాటానికి కార్యాచరణ రూపొందించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సిపిఎస్ రద్దు బాధ్యులు జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం ఏలూరు లో ఆదివారం జరిగిన నాన్ గెజిటెడ్ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం అనంతరం జోడాల తాళ్లపూడి లో విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి పోరాట కార్యాచరణలో భాగంగా ఈనెల 19 మరియు 26 తేదీల్లో స్పందన కార్యక్రమంలో సిపిఎస్ రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. జిపిఎస్ రద్దు కోరే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఈ నెల 25న ఆదివారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం జూలై 8నకలెక్టరేట్ ల వద్ద ధర్నా కార్యక్రమాలకు పిలుపు ఇచ్చామన్నారు. ఇంత వరకు డిఎలు రాలేదని, పిఆర్‌సిలో పెండింగ్ ఉన్న డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆరు రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం కొనసాగుతున్నప్పుడు ఆంధ్రప్రదేశ్లో ఎందుకు అమలు చేయలేరని ప్రశ్నించారు. ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తూ, పాత పెన్షన్ అమలు జరిగేలా ప్రతి ఒక్కరు పోరాడాలన్నారు.

గోరంట్లకు వినతిపత్రం ఇస్తున్నఫ్యాప్టో నాయకులు

విద్యా రంగ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తిరోగమన విధానాలను నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో)ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న అనుసరిస్తున్న వైఖరిని నిరోధించాలని, జిఒ నెంబర్ 117 పేరిట ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందన్నారు. వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సమస్యలపై స్పందించిన ఎంఎల్ఎ బుచ్చయ్య చౌదరి వీటన్నిటిని పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎ.షరీఫ్, ఇవి ఎస్ఆర్.ప్రసాద్, ఎన్.రవిబాబు, చిలుకూరి శ్రీనివాసరావు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి ఆత్రేయపురం

ఒక చెందిన మహిళ అదశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన పి.దుర్గాదేవి ఈ నెల 16న తన ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద చుట్టుపక్కల గ్రామాలు వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆదివారం దుర్గాదేవి భర్త పోలీసులు ఫిర్యాదు చేశారు.

గోదావరి మునిగి యువకుడి మృతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గోదావరి స్నానానికి వెళ్లి మత్యువాత పడిన ఘటన ధవలేశ్వరంలోని స్థానిక కాటన్ బ్యారేజ్ వద్ద చోటు చేసుకుంది. తన స్నేహితులతో కలిసి స్థానానికి వెళ్లిన కలగా ప్రసాద్ (20) స్నానం అనంతరం వెళ్ళిపోతూ తన చెప్పులకు బురద అంటుకోవడంతో చెప్పులు కడుక్కోవడానికి తిరిగి మరలా గోదావరిలోకి వెళ్లాడు. కడుక్కుంటూ ఉండగా ప్రమాదవశాత్తు గోదావరిలోకి జారిపడి మునిగిపోయి మరణించాడు. ఎస్ఐ ఎం.కేశవరావు కేసు నమోదు చేశారు.

ఇనుప స్తంభం తగిలి వ్యక్తి మరణం

ప్రజాశక్తి-పెరవలి

జెసిబితో తరలిస్తున్న ఇనుప స్తంభం తగలడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉసులుమర్రు గ్రామం, నరసాపురం నిడదవోలు మెయిన్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. ఇసుక డంపింగ్ యార్డ్ వద్ద తణుకు పట్టణానికి చెందిన నేలపాటి అజయ్ కుమార్ (32) బైకుపై తణుకు వైపు వస్తున్నాడు. ఉసులుమర్రు డంపింగ్ యార్డ్ వద్దకు రాగానే జెసిబి డ్రైవర్ ఒక అనుప స్తంభాన్ని తరలిస్తుండగా బైకుపై వెళుతున్న నేలపాటి అజయ్ కుమార్ తలకు తగిలింది. బలమైన గాయం తగలడంతో అతడు సంఘటనా స్థలంలో మతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-గోపాలపురం

మద్యానికి బానిసైన భర్తలో మార్పు రాకపోవడంతో మనస్తాపానికి గురై నిద్ర మాత్రలు మింగి చికిత్స పొందుతూ వివాహిత మతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోమటికుంట గ్రామానికి చెందిన పునుగుమాటి రవీంద్ర మద్యానికి బానిసై కుటుంబ పోషణకు ఇంటిలో డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో భార్య జ్యోతి (28) భర్తను తాగవద్దని పలుమార్లు చెప్పింది. అయినప్పటికీ భర్తలో ఎటువంటి మార్పు రాలేదు. జ్యోతి ఐదేళ్లుగా ఫిట్స్ వ్యాధితో బాధ పడుతోంది. కుటుంబ పోషణ భారంగా మారడంతో భర్తలో ఎటువంటి మార్పూ రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యింది. ఇంట్లో ఉన్న మాత్రలు మింగేసింది. ఆమెను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మతి చెందినట్టు ఎస్ఐ కె.రామకష్ణ తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామ శివారున పేకాడుతున్నానే సమాచారంతో ఎస్ఐ వై.గణేష్ కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. వీరిలో ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1200 సీజ్ చేశారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం మర్లావ గ్రామంలో ఆదివారం ఎస్ఇబి సిఐ కెవి.స్వామి ఆధ్వర్యంలో సారా బట్టీలపై నిర్వహించిన దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ వై.నాగేంద్ర కష్ణ తెలిపారు. దీనికి సంబంధించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సారా అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.

రెండు బైకుల చోరీపై కేసుల నమోదు

ప్రజాశక్తి-గండేపల్లి

యల్లమిల్లి గ్రామానికి చెందిన పులపకూర చంద్రరావు తాను పనిచేసే యల్లమిల్లి గ్రామ శివారున రంగంపేట రోడ్డులో బైకు పెట్టి బయటికి వెళ్లి వచ్చేసరికి కనిపించలేదు. దీంతో ఆయన ఫిర్యాదుపై వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేశారు. గండేపల్లి గ్రామానికి చెందిన ఉప్పులూరు శ్రీనివాస్ తన బైకుపై పొలం వెళ్లి అక్కడ పనులు చూసుకుని తిరిగి వచ్చేసరికి తన బైకు కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రాజ్యాంగ విలువలు పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకమైనదని ఐలాజ్ కేంద్ర కమిటీ సభ్యులు బుగతా శివ అన్నారు. ఈ నెల 25న విజయవాడలో జరిగే రాజ్యాంగ విలువలు పరిరక్షణ-న్యాయవాదుల పాత్ర అనే అంశంపై రాష్ట్ర సదస్సు విజయవంతానికై పోస్టర్‌ను ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ సదస్సుకు ఐలాజ్ జాతీయ కార్యదర్శి కెప్టెన్, మాజీ న్యాయమూర్తులు ఎం.రాజేంద్ర, జేసురత్నం ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం కోసం ఐలాజ్ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బండారు నరసింహారావు, కందా వెంకటరాజు, అనూహ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బడి ఆటో

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పాఠశాలలు ప్రారంభమయ్యాయి. పుస్తకాలు, యూనిఫారం, లంచ్ బాక్సులు లాంటి వస్తువులు కొనడంలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వాటన్నింటికంటే ముఖ్యమైనది పిల్లలు పాఠశాలకు చేరే విధానంపై ఎక్కువ మంది తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని సంబంధింత వాహనాల యజమానాలు వారి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో ఆటోలు ముందు వరుసలో ఉన్నాయి. డబ్బు సంపాదనే తప్ప పిల్లల ప్రాణాల గురించి చాలామంది ఆటో డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. ఎంత మంది పిల్లలను ఎక్కిస్తే అంత ఆదాయం వస్తోంది అనే ఆలోచనలోనే డ్రైవర్లు ఉంటున్నారు. ఇదే ప్రమాదాలకు ముఖ్య కారణంగా మారుతోంది. స్కూల్ బస్సుల సమాచారం పూర్తిగా రవాణాశాఖ అధికారుల దగ్గర ఉంటుంది. కాబట్టి వీరు కొంతమేరకు నిబంధనలు పాటిస్తుంటారు. కానీ స్కూల్ ఆటోల సమాచారం అధికారుల వద్ద ఉండదు. ఈ ఆటోలకు రవాణా శాఖ నుంచి ప్రత్యేకమైన అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు. దీంతో అధికారులు కూడా వీటిని నియంత్రించలేక పోతున్నారు.

ఇరుకు రహదారుల్లోనూ అతివేగం

జిల్లాలో సుమారు పదివేల ఆటోలు ఉంటాయని అంచనాగా తెలుస్తుంది. ఎక్కువ శాతం ఆటోలు ప్రధాన రహదారుల నుంచి కాక సందుల్లో, చిన్నచిన్న రోడ్ల వెంట పిల్లలను తీసుకెళ్తుండడంతో వీటిపై నియంత్రణ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆటోలపై తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను కుక్కి అతివేగంగా డ్రైవర్లు ఆటోలను తోలుతున్నారు. ఒకవైపు పాఠశాల సమయం ముగుస్తుందని గేటు వేస్తారని ముందు వెనక చూసుకోకుండా దూసుకు వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధికారుల నియంత్రణ లేకపోవడం, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యంతో పాఠశాలల ఆటోలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రైవేట్ బస్సులకు ఫీజులు చెల్లించే స్తోమత లేని కారణంగా తప్పని పరిస్థితుల్లో తమ పిల్లలను ఆటోలో పంపించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక పల్లెల నుంచి సరైన బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ఆటోలు, టాటా మ్యాజిక్ వంటి వాహనాలను పాఠశాల విద్యార్థులను తరలించేందుకు జిల్లాలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులను తరలించే వాహనాలకు సంబంధించి ఎప్పటి నుంచో ఉన్న నిబంధనలను ఆటో డ్రైవర్‌లు పాటించడం లేదు. సాధారణ ఆటోల్లో విద్యార్థులను ఆరుగురికి మించి ఎక్కించకూడదు. టాటా మ్యాజిక్‌లో 10 మందికి మించకూడదు. డ్రైవర్ల పక్కన ఎట్టి పరిస్థితుల్లో కూర్చోపెట్టకూడదు. స్కూల్ ఆటోలకు సైడురాడ్లు తప్పక అమర్చాలి. ప్రతి స్కూల్ ఆటోలో ప్రథమ చికిత్స కిట్‌లు తప్పనిసరిగా ఉండాలి. ఆటోలకు సంబంధించిన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఎఫ్‌సి సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితరాలు అందుబాటులో ఉంచుకోవాలి. డ్రైవర్ యూనిఫాం తప్పనిసరిగా ధరించాలి. ఈ నిబంధనలు పాటించకుండా పోలీసు, రవాణాశాఖ దారుల్లో పట్టుబడితే జరిమానాలు భారీగా ఉంటాయని అధికారులు తెలుపుతున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడి ఓవర్ లోడింగ్‌కు పాల్పడితే భారీ జరిమానాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త

ఆటోలలో డ్రైవర్ సీటుకు అటు, ఇటు, లోపల కాస్తా కూడా ఖాళీ లేకుండా విద్యార్థులను ఎక్కించుకుంటున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఆటోల్లో విద్యార్థుల రాకపోకలు మాత్రం ఆగడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత బాధ పడేకంటే తల్లిదండ్రులు ముందే మేల్కొనాలి. బడి పిల్లలను ఆటోలలో స్కూళ్లకు పంపే తల్లిదండ్రులు ఆటోలలో అసలు ఎంత మంది వెళుతున్నారు. ఆటో డ్రైవర్ ఎన్ని ట్రిప్పులు వేస్తున్నారు అనే విషయం ముందుగానే తెలుసుకోవాలి. ఆటో డ్రైవర్ పూర్తి వివరాలు ప్రతి తల్లిదండ్రుల వద్దా ఉండాలి. డ్రైవర్ ఎంత స్పీడ్‌లో వెళ్తున్నాడో, పిల్లలతో ఎలా ప్రవర్తిస్తున్నాడో ఎప్పటికప్పుడు పిల్లలను అడిగి తెలుసుకోవాలి. ఆటో సమాచారాన్ని సంబంధిత పాఠశాలలకు తల్లిదండ్రులే అందించాలి. స్కూల్ యాజమాన్యాలు, సిబ్బంది కూడా వారి స్కూళ్లకు ఎక్కువ మంది పిల్లలను తీసుకువచ్చే ఆటోలను అనుమతించకూడదు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే స్కూళ్లకు చెడ్డపేరు వస్తుందని యాజమాన్యం కూడా గుర్తించాలి. ఆటో ప్రయాణాలపై బాధ్యతగా మెలగాలి.

యానాం వార్తలు

దరియాలతిప్ప మున్సిపల్ కళ్యాణ మండపం

అధ్వానంగా మున్సిపల్ కళ్యాణ మండపం

ప్రజాశక్తి - యానాం

యానాం దరియాలతిప్పలోని మున్సిపల్ కళ్యాణ మండపం అధ్వానంగా మారింది. కల్యాణ మండపం నిర్వహణ లేకపోవడంతో చెత్తా చెదారం పేరుకుపోయింది. కళ్యాణ మండపం దుస్థితిపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణ మండపం చుట్టూ మొక్కలు పెరిగిపోవడంతో పాములు వస్తున్నాయని మున్సిపల్ యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కళ్యాణ మండపం నిర్మించినా నేటి వరకూ కనీస సదుపాయాలు ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు. కరెంటు, తాగునీరు ఇతర సదుపాయాల్లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమిడి బాలయోగి, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి తదితర గ్రామస్తులు మాట్లాడుతూ మండపంలో వెంటనే తగిన సదుపాయాలు కల్పించాలని, నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆడబిడ్డకు రూ.50 వేల పథకం అమలు

పుదుచ్చేరి, కారైకల్, మాహే, యానాంలో ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పుట్టిన ప్రతి ఆడపిల్లకూ రూ.50 వేలు డిపాజిట్ చేస్తామని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి ప్రకటించిన పథకం అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లలకూ రూ.50 వేల చొప్పున డిపాజిట్ చేయడానికి స్త్రీ శిశు సంక్షేమశాఖ నిర్ణయించింది. పథకం అమలుకోసం ఆర్థిక శాఖ అనుమతికి ఫైల్ పంపారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదించగానే అమల్లోకి వస్తుంది.

ఘనంగా మరిడమ్మ ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

పెద్దాపురం మరిడమ్మ జాతర సందర్భంగా స్థానిక పాత పెద్దాపురంలో ఆ ప్రాంత ప్రజల ఆధ్వర్యంలో, మరిడమ్మ ఆలయం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో జాగరణ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మరిడమ్మ ఆలయం వద్ద ఈ ఉత్సవాలను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి ప్రారంభించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తూ జాగరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత పెద్దాపురంలో జరిగిన జాగరణ ఉత్సవంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవ, విడదాసరి రాజా, ఆకుల కష్ణ బాపూజీ పాల్గొన్నారు. ఆ ప్రాంత ఉత్సవ కమిటీ సభ్యులు వంగలపూడి సతీష్, గరగ శ్రీను, తామాడ శివ, కోమలి రాజు, లంక గోవిందు, దంగేటి శ్రీను, పెంకే భద్రరావు, పడమటి జగన్నాథం తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన జాగరణ ఉత్సవంలో పలు జానపద కళారూపాలు ప్రదర్శించారు.

విధుల్లో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ భద్రతకు అధిక ప్రాధన్యతను ఇచ్చి పని చెయ్యాలని సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ కె.రమేష్ పిలుపు నిచ్చారు. సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో ఆదివారం స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ స్టేషన్ పరిధిలో పని చేసే సిబ్బందితో భద్రతా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు భద్రతకు సంబంధించి వచ్చే సర్క్యులర్లు క్షుణ్ణంగా పరిశీలించి వాటిని అమలు పరచాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. విధినిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తెలియ చేయాలని సిబ్బందికి తెలిపారు. ప్రయాణికుల భద్రతే ప్రధాన ధ్యేయంగా పని చేయాలని సిబ్బందిని కోరారు. స్టేషన్ పరిధిలో సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాల చెంతనే పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

శిథిలమైన కల్వర్టు

స్థానిక నీలమ్మ చెరువు దగ్గర మున్సిపల్ ఉన్నత పాఠశాలకు సమీపంలో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుపై ఉన్న కల్వర్టు కుంగింది. పెద్దగుంటలు ఏర్పడి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. ఆ మార్గం ద్వారా వాహనదారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శించారు. నిత్యం అనేక మంది ప్రయాణించే రోడ్డుపై అధికారులు కనీసం ప్రమాద సూచిక బోర్డు కూడా పెట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సామర్లకోట పట్టణ పరిధిలో బలుసులుపేట అంబేద్కర్ విగ్రహం సమీపాన తోట గోపాలకష్ణ మున్సిపల్ పాఠశాలకు అతి సమీపాన మూడు రోడ్డుల కూడలిని కలుపుతూ ఉన్న కల్వర్ట్‌కు పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో కల్వర్టు గోతుల్లో గుంటలలో పడి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. తోట గోపాలకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు వెళ్లే పలువురు విద్యార్థులు సైతం ఈ గుంటలు పడిన కల్వర్ట్ బారిన పడి గాయాలపాలయైన సంఘటనలు లేకపోలేదు. రాబోయే వర్షాకాలంలో ఈ కల్వర్టు మిగిలిన భాగం కూడా పూర్తిగా పడిపోయే ప్రమాదం ఉంది. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే శిథిలమైన కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోహన్‌కు జెఇఇ ఆలిండియా ర్యాంక్

ప్రజాశక్తి- కరప

కరప గ్రామానికి చెందిన వడ్డి రోహన్ శివతేజ జెఇఇ ఆలిండియా స్థాయిలో 2261 ర్యాంకు సాధించి చెన్నై ఐఐటికి సెలెక్ట్ అయినట్టు తల్లిదండ్రులు వడ్డి వెంకటేశ్వరరావు, సత్య కుమారి తెలిపారు. రోహన్ శివతేజ మాట్లాడుతూ చెన్నై ఐఐటిలో సీట్ రావడం చాలా గర్వంగా ఉందని, నా శ్రమకు ఫలితంగా ఐఐటిలో నా చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. ఐఐటి పూర్తవ్వగానే ఇండియన్ సివిల్ సర్వీసు సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేసాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

వారాహి యాత్రపై ప్రచారం

ప్రజాశక్తి- కరప

కాకినాడ రూరల్ సర్పవరంలో వారాహి యాత్రను విజయవంతం చేసేందుకు మండలంలోని పంతం నానాజీ ఆటో ప్రచారం భారీ స్థాయిలో నిర్వహించారు. మండలం నుంచి జనసైనికులు వేలాదిగా తరలి వెళ్లారు. కరప మండల నాయకులు బోగిరెడ్డి కొండబాబు, బోగిరెడ్డి గంగాధర్, బండారు మురళీకష్ణ, గంటా నానిబాబు, యాళ్ల పండు, తదితర నాయకులు ఆధ్వర్యంలో జనసైనికులు తరలి వెళ్లారు.

108లో ప్రసవం

ప్రజాశక్తి-మండపేట

గర్భిణిని కాన్పు కోసం 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో ఆమె ప్రసవించింది. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానిక గాంధీనగర్ నుంచి శీలం కుమారి గర్భిణి. ఆమెను మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు రావడంతో 108 సిబ్బంది జె.మీనాక్షి, వి.వెంకటేష్‌లు బంధువులు సహాయంతో డెలివరీ చేశారు.సాధారణ ప్రసవం జరిగి మగబిడ్డ జన్మించింది. అనంతరం తల్లి, బిడ్డను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

చిన్నారులకు సైకిల్ అందజేస్తున్న సభ్యులు

డొక్కా సీతమ్మ సేవా సమితి సాయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన, తోలేటి రేవతి, సాయి లకు రావులపాలానికి చెందిన డొక్కా సీతమ్మ సేవ సమితి. ఆదివారం సైకిల్, నిత్యావసర సరకులు, ఫ్రూట్స్ వారికి అవసరమైన సామగ్రిని అందజేశారు. చిన్నారులు చిన్న వయసులోనే తల్లిదండ్రులు అనారోగ్యంతో చనిపోవడంతో అమ్మమ్మ సంరక్షణలో ఉంటున్నారు ఈ చిన్నారులు ఇద్దరు అనారోగ్యం బాధపడుతున్నారు ఏ విషయం తెలుసుకున్న డొక్కా సీతమ్మ సేవాసమితి స్పందించి సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ గారి సేవాసమితి సిబ్బంది బడుగు సుబ్బాయమ్మ వంశీ పాల్గొన్నారు.

నేడు మత్స్యకారులతో సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లాలో చేపట్టిన వారాహి యాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం కాకినాడలోని ఏటిమొగ ప్రాంతంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. మత్స్యకారులతో ముఖాముఖి, సమస్యల భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేలా అక్కడ మత్స్యకారులతో మాట్లాడనున్నారు. కాకినాడ సిటీ ఎంఎల్‌ఎపై తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో పవన్ కళ్యాణ్ పర్యటనను భద్రతా కారణాలతో ఆపేస్తారా లేక మత్స్యకారులను కలుస్తారా అనేది సందిగ్ధంగా మారింది.

కప్‌తో విజేతలు

క్రికెట్ ప్రీమియం లీగ్ విజేత 'లోవ లెవెన్స్'

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్నంలోని శ్రీకత్తివెంటి పేర్రాజు పంతులు, క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామచంద్రపురం ప్రీమియంలీగ్ గ్రాండ్ ఫైనల్ భాగంగా రామచంద్రపురం లోవ లెవన్స్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా, రాయల్ చాలెంజర్స్ నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సభలో విజేతలకు ట్రోఫీ అందజేశారు. రామచంద్రపురం ప్రీమియర్ లీగ్, సీజన్ వన్ కు సహకరించిన దాతలు కెవిఆర్ హాస్పిటల్, అమత రక్ష హాస్పిటల్, జిఎస్ ఫ్రెండ్స్ సర్కిల్, హితీష్ స్పోర్ట్స్, విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్, రఘురాం, సుధా బుజ్జి , ఫణి ఫ్రెండ్ సర్కిల్ కు కతజ్ఞతలు తెలిపారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదం శెట్టి శ్రీదేవి, బాస్కెట్బాల్ జనరల్ సెక్రటరీ గన్నమణి చక్రవర్తి, వార్డు కౌన్సిలర్ తోట అమ్మాజీ తదితరులు పాల్గొని రామచంద్రపురం ప్రీమియంలీగ్‌కు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఫాదర్స్ డే

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

బండారులంక గ్రామంలో శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఇంటి వద్ద ఆయన సతీమణి చంద్రకళ ఆధ్వర్యంలో ఆదివారం ఫాదర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తన తండ్రి కడి వీర్రాజు ని ఆయన సోదరి బి.లీలా కుమారి, చింత రేణుక శ్యామల, తమ్ముడు కడి తాతారావు తో కలిసి శాలువా కప్పి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ట్రస్టీ చింత శంకరమూర్తి, చింత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోటి దీపాల చెరువు ఆధునికీకరణ

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని నర్సిపూడిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి కోటి దీపాల చెరువు రుడా పరిధిలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని సర్పంచ్ కండిబొట్ల శ్రీను, ఉప సర్పంచ్ చల్లా సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి సభ్యులు మెడిశెట్టి సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు పనులను పరిశీలించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలమూరు మండలం రుడా పరిధిలోకి వెళ్లిందన్నారు. దీంతో ముందుగా ఈ గ్రామ అభివద్ధిలో భాగంగా చెరువు ఆధునీకరణకు రుడా ఆమోదం తెలిపిందన్నారు. ఇందులో భాగంగా చెరువు పూడిక తీత, చుట్టూ వాకింగ్ ట్రాక్ వంటి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికి వారు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపా కేసులు ఎత్తివేయాలని ప్రదర్శన

పెద్దాపురం : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ చైర్‌పర్సన్ విమలక్క, మోహన్ బైరాగిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టిన ఉపా చట్టం కేసులు వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలనకు ఈ కేసులు అద్దం పడుతున్నాయన్నారు. తక్షణమే ఈ కేసులు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, ఎఐఎఫ్‌టియు కార్యదర్శి కుంచే అంజిబాబు, దేశెట్టి సురేష్, వల్లూరి సత్తిబాబు, వీరబాబు, రాంబాబు, రాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీలో అభిషేక్‌కు రజతం

ప్రజాశక్తి-రామచంద్రపురం

బ్రాంజ్ మెడల్ తో విజేతలు

పట్టణంలోని మోడరన్ కళాశాల విద్యార్థి అభిషేక్ ఆల్ ఇండియా లెవెల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారని కరస్పాండెంట్ జివి.రావు తెలియ చేశారు. హర్యానాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో మోడరన్ విద్యాసంస్థలలో 9 వ తరగతి చదువుతున్న బోను అభిషేక్ బాలుర డబుల్స్ కేటగిరీలో రాణించి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పాల్గొంటున్న ప్రతీ పోటీలో విజేతగా నిలుస్తున్న అభిషేక్‌కు జివి.రావు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ ప్రతి టోర్నమెంట్లోను అభిషేక్ విజేతగా నిలుస్తున్నాడని, అతని తల్లిదండ్రులకు మోడరన్ విద్యాసంస్థలకు కూడా గొప్ప గౌరవమన్నారు. ఈ విజయ పరంపర అభిషేక్ కొనసాగిస్తూ, ప్రపంచం గర్వించదగ్గ ప్లేయర్ కావాలని ఆకాంక్షించారు. తనకు కి బ్రాంజ్ మెడల్ తో పాటు నగదు పురస్కారం టోర్నమెంట్ నిర్వాహకులు అందజేసినట్లు అభిషేక్ తెలిపాడు. ఈ సందర్భంగా అభిషేక్ కి పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు,అభినందనలు తెలిపారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

ప్రజాశక్తి-రావులపాలెం

ఆంధ్రప్రదేశ్ లో శాంతి భద్రతలు పూర్తి గా క్షీణించాయని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కొత్తపేట మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ . రాష్ట్రంలో మహిళలకు, చిన్నపిల్లలకు రక్షణ కరువైందనిఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ వంటి పారిశ్రామిక నగరంలోనే రక్షణ లేని పరిస్థితులను చూస్తున్నామన్నారు. చివరకు బడికి వెళ్లే విద్యార్థులు సైతం రౌడీ మూకల దాడులకు బలైపోతున్నారని సత్యానందరావు ఆందోళన వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలెంకు చెందిన అమర్నాథ్ అనే విద్యార్థి హత్య గురికావడం ఆందోళన కలిగిస్తుందన్నారు. హత్యకు గురైన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తే చాలనే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను గాలికి వదిలేసిన ఈ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేస్తున్నామని ఆయన అన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-నల్లజర్ల

పరామర్శిస్తున్న నాయకులు

జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు నల్లజర్ల మండలంలోని అనంత పల్లి గ్రామంలో మృతుల కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. అనంతపల్లి గ్రామానికి చెందిన బోయిన శ్రీను మాతృమూర్తి, గంపల శ్రీను, మాతృమూర్తి, అవిర్ని గంగాధరరావు తండ్రి ఇటీవల మరణించారు. దీంతో వీరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట రావూరి వెంకటరమణ, ఏలేటి సత్యనారాయణ, కెంగం శ్రీను, పావులూరి శ్రీను, బొల్లిన బాబి, గన్నమని దుర్గాప్రసాద్, గురుమిల్లి శ్రీను, విప్పిలి వీరరాఘవులు తదితరులు ఉన్నారు.

మహారాజశ్రీ 2వ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం

I.A.No.151/2023, I.A.No.152/2023
I.A.No.153/2023 in O.S.No.17/2013

Between:
1) Vemana Alias Mandapalli Lakshmi Krupakar
2) Mandapalli Vijaya
3) Mandapalli Sagar Sastry
...Petitioners
AND
Sabitha Krupa Grace and Others
...Respondents

R-7: Regani Jayamma, C/o. Late Sathiraju, Hindu, Occupation House Wife, D.No.61-7-11/4, P&T Colony, Near Baba Tample, Rajahmundry RJY JCJC.
R-8: Regani Lakshmi, C/o. Late Sathiraju, Hindu, Occupation House Wife, D.No.61-7-11/4, P&T Colony, Near Baba Tample, Rajahmundry RJY JCJC.

పై నెంబరు పిటీషనులో 7, 8 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్ప వేయుచున్నారు. కావున **దీ.27-06-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎస్.శ్రీరామచంద్రమూర్తి
అడ్వకేట్, శ్యామలా నగర్, రాజమండ్రి.
రాజమండ్రి,
19-06-2023.